సాక్షి
జగిత్యాల
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న దర్శనానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. భక్తుల ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.



రజకులకు మంచి రోజులు

రజకులు తమ కుల వృత్తుల ద్వారా ఆదాయం పెంపొందించుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టింది. 8లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరదకాలువకు ఐదు వేల క్యూసెక్కులు



వరద కాల్వలో ప్రవహిస్తున్న సాగు నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు లోకి 14,088 క్యూసెక్కుల వరద నీరు, ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వస్తోంది. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండడంతో కాకతీయ మెయిన్ కెనాల్‌కు 2500క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 5వేలు, లక్ష్మీ కెనాల్‌కు 200, సరస్వతి కెనాల్‌కు 300, గుత్పఅలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 270, వరదకాలువకు 5వేలు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నారు.

కొండగట్టులో సినీ నటి అనన్య నాగల్ల పూజలు



కుటుంబ సభ్యులతో అనన్య నాగల్ల

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారిని సినీ నటి అనన్య నాగల్ల కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ఆమెకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. కొడిమ్యాల మండలం నాచుపెల్లి బృందావన్ రిసార్ట్‌లో భోజనాలు చేసి తిరుగుపయనమ్యారు. ఆమె వెంట సినీ నటుడు మొగిలిపాలెం రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పులి వెంకటేశ్‌గౌడ్, కోలపుర రమేశ్ ఉన్నారు.

నీరు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి డీ–29 ఉపకాలువకు నీరు విడుదల చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిట సత్యంరెడ్డి ఆధ్వర్యంలో రైతులు మంగళవారం అధికారులకు వినతిపత్రం అందించారు. కాలువకు నీరు విడుదల చేయకుంటే దానికింద సాగవుతున్న వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే అవకాశముందన్నారు. అధికారులు స్పందించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్‌రెడ్డి, నాయిని వెంకట్, మారంపల్లి శంకర్, వంగ అశోక్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

జగిత్యాలటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం జగిత్యాల టవర్ ప్రాంతంలో భిక్షాటన చేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలు ఇవ్వాలని, కొత్త మెనూ ప్రకారం బడ్జెట్ విడుదలతోపాటు కోడిగుడ్లకు అదనపు నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. పూర్తి సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు సప్‌లై చేయాలన్నారు. గుర్తింపుకార్డులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

కొండగట్టులో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే పూజలు



కొండగట్టు: కొండగట్టు ఆంజనేయస్వామివారిని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శాలువతో సత్కరించారు.

ఇక్కడి నుంచే జైత్రయాత్ర



జగిత్యాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రులు



ఇళ్లకోసం బారులు తీరిన మహిళలు

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు
- జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నాం
- అందుబాటులోకి వైద్య కళాశాల, సమీకృత మార్కెట్, ఎస్పీ కార్యాలయం
- ప్రతి పేదనూ ఆదుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం
- గతంలో మంత్రులు చేయలేని పనులు ఎమ్మెల్యే సంజయ్ చేస్తున్నారు
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ.రామారావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మంత్రులు..

జగిత్యాల: బీఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర జగిత్యాల నుంచే ప్రారంభమవుతుందని, గతంలో ఇక్కడ మంత్రులుగా పనిచేసిన వారికంటే ఇప్పుడున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అనేక పనులు చేసి చూపించారని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో లబ్ధిదారులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లకు మంజూరు పత్రాలు అందించారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట, ధర్మపురి కంటే జగిత్యాలకు 4,520 ఇళ్లు మంజూరు చేయించుకుని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేదలకు అండగా నిలిచారని తెలిపారు. జగిత్యాల జిల్లా అనంతరం కలెక్టరేట్, వైద్య కళాశాల, ఎస్పీ కార్యాలయాలు అందుబాటులోకొచ్చాయన్నారు. పరిపాలన కూడా ప్రజలవద్దకే వచ్చిందన్నారు. జిల్లాకేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుందామన్నారు. సంజయ్ మళ్లీ గెలిస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ ఆధారితమని, రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడంతో పంటలు పండించుకుంటున్నారని వివరించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏళ్లతరబడి పాలించినా రైతుల కోసం ఒక్క మంచి పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆరు దశాబ్దాల పాటు పాలించి ప్రజలను ఆగం చేశారని ఆరోపించారు.

కాంగ్రెస్, బీజేపీ కలిసి కవితను ఓడించారు: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కవితను ఓడించారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కవిత సహకారంతో జగిత్యాలకు 4,520 డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయించుకున్నామని పేర్కొన్నారు. జగిత్యాలలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందన్నారు. కేసీఆర్ అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటూ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. అలాగే యావర్‌రోడ్ వెడల్పు, అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో 20వేల ఎకరాలు పండే వరిని ఇప్పుడు 60వేల ఎకరాల్లో పండిస్తున్నారన్నారు. జగిత్యాలలో డ్రాగన్‌ఫ్రూట్, జామ, బొప్పాయి వంటి పంటలు పండిస్తున్నారని, ఇక్కడ హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. రూ.600 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు.

కళ్ల ముందే అభివృద్ధి: మంత్రి కొప్పుల ఈశ్వర్

జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అది కళ్ల ముందే కనబడుతోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, ప్రజల అవసరాలను గుర్తించి జిల్లాను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. కేటీఆర్ గొప్ప నాయకుడని ఎమ్మెల్సీ రమణ అన్నారు. ఆయన చేసిన అభివృద్ధితోనే ఆయన గుర్తింపు వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోరుట్ల, చొప్పదండి, చెన్నూర్ ఎమ్మెల్యేలు విద్యాసాగర్ రావు, సుంకె రవిశంకర్, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు రమణ, భానుప్రసాద్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన సాగింది ఇలా..

- మంత్రి కేటీఆర్ హెలికాప్టర్ దిగి నేరుగా రూ.38.4 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు.
- అక్కడి నుంచి బస్సులో వెళ్లి నూకపల్లిలో రూ.280 కోట్లతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు.
- అక్కడ కొందరు లబ్ధిదారులు గృహప్రవేశం చేయగా.. వారి ఇళ్లలోకి వెళ్లి ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.
- వ్యవసాయ మార్కెట్ సమీపంలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు.
- నేరుగా అక్కడి నుంచి మినీస్టేడియంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

ధర్మపురిలో రూ.247 కోట్లతో అభివృద్ధి పనులు



ధర్మపురిలో పైలాన్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలో రూ.247 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ మంత్రి కొప్పుల ఈశ్వర్, హోంశాఖ మంత్రి ముహమ్మద్ అలీతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. ధర్మపురిలో రూ.8 కోట్లతో నిర్మించి న మాతాశిశు ఆస్పత్రిని ప్రారంభించారు. వెల్గటూర్‌లోని ఇథనాల్ ప్రాజెక్టు స్థానంలో రూ.60కోట్లతో ని ర్మించే వ్యవసాయ కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళా శాల మైదానంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అంటే కాళేశ్వరమని, కాంగ్రెస్ అంటే శనీశ్వరమని, 50ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేపట్టని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసి చూపించిందని పేర్కొన్నారు. కాళేశ్వరంతో లక్ష ఎకరాలకు సాగు నీరందిస్తున్నామని, రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ అక్కరకురాని పథకాలంటూ ప్రజల వద్దకు వస్తుందని తెలిపారు. 11 సార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేని పార్టీ ఇప్పుడేం చేస్తుందో చెప్పాలన్నారు.

ధర్మపురి ధర్మరాజు కొప్పుల

ధర్మపురిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రి కొప్పుల ధర్మపురి ధర్మరాజుగా ప్రజలు గుర్తిస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్‌కు నమ్మినబంటుగా ఉన్న కొప్పులను నాలుగుసార్లు గెలిపించి మంత్రిని చేసుకున్నారని, ఐదోసారి 50 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ధర్మపురి పట్టణ అభివృద్ధికి తక్షణమే రూ.25కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ధర్మపురిలో కరకట్ట నిర్మాణం, ఐటీఐ, ఎస్టీవో కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, బాదినేని రాజేందర్ తదితరులున్నారు.

ఏసీబీకి పట్టుబడిన ఆర్ఐ

- భూమి నాలా కన్వర్షన్ కోసం రూ.15వేలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- ఆర్ఐ, అతడి సహాయకుడి రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



ఏసీబీ అధికారుల అదుపులో ఉన్న ప్రవీణ్



తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓ అవినీతి అధికారి ఏసీబీ వలకు చిక్కాడు. రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఆర్ఐ తిరుపతితోపాటు అతడి సహాయకుడు ప్రవీణ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంఘటన వివరాలను ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ వీవీ.రమణమూర్తి వెల్లడించారు. మండలంలోని మేడిపల్లికి చెందిన బద్దం శంకర్‌కు గ్రామ శివారులోని సర్వే నంబర్ 797/ఉ/1లో తన భార్య లక్ష్మి పేరిట ఏడు గుంటల భూమి ఉంది. దీనిని నాలా కన్వర్షన్ కోసం గత నెల 22న స్లాట్ బుకింగ్ చేసుకున్నాడు. ఆర్ఐ తిరుపతిని కలువగా.. రూ.25వేల లంచం కావాలని, లేకుంటే పని కాదని తేల్చి చెప్పాడు. అంత మొత్తం ఇచ్చుకోలేనని, రూ.15వేలు ఇస్తానని శంకర్ వేడుకున్నాడు. దీనికి ఆర్ఐ అంగీకరించాడు. ఈ క్రమంలో శంకర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆర్ఐని ఫోన్‌లో సంప్రదించగా.. తన సహాయకుడు ప్రవీణ్‌కు ఆ మొత్తాన్ని ఇవ్వాలని చెప్పాడు. దీంతో కార్యాలయానికి వెళ్లిన శంకర్ డబ్బులను ప్రవీణ్‌కు అందజేస్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న అధికారులు ప్రవీణ్‌తోపాటు ఆర్ఐ తిరుపతిని పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు వారిని కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఏసీబీ దాడి సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా.. అక్కడ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం తెలపడానికి, ఫొటోలు తీసుకునేందుకూ అంగీకరించలేదు. దీనిపై మీడియా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో చివరకు అధికారులు కార్యాలయం బయటకు వచ్చి నామమాత్రంగా వివరాలు వెల్లడించి వెళ్లిపోయారు.

'కొండగట్టు'పై దృష్టి పెట్టండి

- దేవాదాయ కమిషనర్‌కు ట్రస్టుబోర్డు సభ్యుడి ఫిర్యాదు



జ్యోతికి ఫిర్యాదు చేస్తున్న ప్రవీణ్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయ స్వామి ఆలయ సమస్యలపై దృష్టి సారించాలంటూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఏడీసీ అధికారి జ్యోతికి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు పోచమల్ల ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు సమీక్ష లేదని, ఆలయ ఈవో వెంకటేశ్‌ను అడిగినా ప్రయోజనం ఉండడం లేదని తెలిపారు. ప్రతిరోజూ అనవసరపు ఖర్చులు అధికమవుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించి శాలువలు, కండువాలు, లడ్డూలు వృథా చేస్తున్నారని, ప్రసాదం తయారీలో నాణ్యత లోపిస్తోందని, భక్తులతో చేయించడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. బిల్లు మాత్రం ఎక్కువగా దండుకుంటున్నారని తెలిపారు. ఖర్చులపై ఈవోను అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. బుగ్గామఠం గదిని సొంత అవసరాలకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు. లడ్డూ ప్యాకింగ్, టెంట్‌హౌజ్, డెకరేషన్ వంటి పనులకు టెండర్లు వేయాల్సి ఉన్నా.. ఇష్టానుసారం ఇస్తూ.. ఆలయ సొమ్మును వృథా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రతి, మంగళ, శనివారాల్లో ఈవో భక్తులకు అందుబాటులో ఉండరని, కొత్తగా నియామకం అయిన ఉద్యోగులు విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదని తెలిపారు. బోర్డు సభ్యులతో సమీక్ష నిర్వహించేలా ఈవోకు ఆదేశాలు జారీ చేయాలని, లేకుంటే ఈవోను మార్చాలని ఫిర్యాదు చేశానని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బండి సంజయ్‌కు సన్మానం



సంజయ్‌ను సన్మానిస్తున్న బీజేపి నాయకులు

కోరుట్ల: బీజేపీ జాతీయ నాయకుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని కోరుట్ల బీజేపి నాయకులు మంగళవారం రాత్రి సన్మానించారు. నిజామాబాద్‌లో ప్రధాని మోదీ సభలో పాల్గొని తిరిగి కరీంనగర్ వెళ్తున్న సంజయ్ కోరుట్లలో కాసేపు ఆగగా.. నాయకులు ఆయనను సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్, పెండెం గణేష్ తదితరులు ఉన్నారు.

'కోడ్'కు ముందే స్పీడ్!

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బీఆర్ఎస్ దూకుడు
- అవే వేదికలపై తమనే గెలిపించాలని ప్రచారం
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ
- నాలుగు స్థానాలకు బీఎస్పీ అభ్యర్థుల ప్రకటన
- క్యాంపు కార్యాలయాల ఖాళీకి ఎమ్మెల్యేలు సిద్ధం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి పెరిగింది. ఎన్నికల సంఘం పర్యటన మొదలైన దరిమిలా అధికార పార్టీ కూడా అభివృద్ధి పనుల శంకుస్థాపనల స్పీడ్ పెంచింది. అవే వేదికలపై ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించింది. తమను మరోసారి గెలిపిస్తే.. ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తామంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ వస్తే.. రాష్ట్రం అధోగతి పాలవుతుందని మాటల దాడి చేస్తున్నారు. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు అంతా అభివృద్ధి పనుల స్పీడ్ పెంచారు. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల పనులు, పెండింగ్ పనులు పూర్తిచేయడం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, దళితబంధు జాబితా ఎంపిక, పింఛన్లు పంపిణీ, రోడ్లు, మున్సిపల్ వర్క్స్ తదితరాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల వేగం పెంచారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏదిచేసినా ఈనెల 6– నుంచి 14 తేదీలోగా పూర్తిచేయాలన్న పార్టీ అధిష్ఠానం సూచనలతో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసే పనిలో ఉన్నారు. 60 ఏళ్లలో పాత జిల్లాలో జరిగిన అభివృద్ధి, గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తాము దేశంలో ముందున్నామని వివరిస్తున్నారు. 13 నియోజకవర్గాల్లో ప్రతీరోజూ చేరికల పర్వంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెద్దపల్లి, జగిత్యాల, రామగుండం, ధర్మపురిలో అభివృద్ధి పనులను ప్రారంభించి ఎన్నికల సమరశంఖం పూరించారు. మినీ బహిరంగసభలతో ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు.

ఎమ్మెల్యేల ప్రైవేట్ కార్యాలయాలు సిద్ధం

ఎన్నికలకు ముందస్తు వ్యూహంతో వచ్చిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ముందే అభ్యర్థులను ప్రకటించింది. వాస్తవానికి మరునాటి నుంచే అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మధ్యలో జమిలి ఎన్నికల ప్రస్తావనతో కాస్త విరామం ప్రకటించారు. ఇటీవల జమిలి లేదని తేలడంతో తిరిగి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వేదికలపై నుంచి తమ అభివృద్ధి వివరిస్తూనే.. ప్రత్యర్థులపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూలు విడుదలవనున్న నేపథ్యంలో క్యాంపు కార్యాలయాలను ఖాళీ చేసేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఇప్పటికే అందరికీ అందుబాటులో ఉండేలా వారంతా ప్రైవేట్ కార్యాలయాలను కిరాయికి తీసుకోవడం విశేషం. మరోవైపు.. సోషల్ మీడియాను కూడా బలోపేతం చేసుకుంటున్నారు. ప్రతీ గ్రామంలో సోషల్ మీడియా ఆర్మీలను నియమించుకుంటున్నారు. పర్వదినాలు, పండుగలు, పరామర్శలు.. ఇలా సందర్భమేదైనా ముందుంటున్నారు.

కాంగ్రెస్, బీజేపీలో రాని స్పష్టత..

ఉమ్మడి జిల్లా నుంచి 13 నియోజకవర్గాల్లో పోటీచేసేందుకు కాంగ్రెస్ నుంచి 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు అదేసంఖ్యలో బీజేపీ నుంచి అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇంతవరకూ రెండుపార్టీలు ఒక్కఅభ్యర్థిని కూడా అధికారికంగా ప్రకటించలేదు. పాత కరీంనగర్ జిల్లాలో ఒకటిరెండు చోట్ల మినహా అన్నిస్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారన్న ప్రచారం ఉన్నా.. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బీజేపీ అభ్యర్థుల విషయంలో ఇదేరకమైన అనిశ్చితి నెలకొంది. దీన్నిఅవకాశంగా తీసుకున్న బీఆర్ఎస్.. మరింత దూకుడు పెంచుతోంది. 11మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ప్రతీరోజు సుడిగాలి పర్యటనలు చేస్తూ అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

బీఎస్పీ జాబితా విడుదల..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఎస్పీ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో మూడు ఎస్సీ స్థానాలు, ఒకటి జనరల్ కావడం విశేషం. నిశాని రామచందర్ –మానకొండూరు, చొప్పదండి– కొంకటి శేఖర్, ధర్మపురి– నక్కా విజయ్‌కుమార్, పెద్దపల్లి–దాసరి ఉష పేర్లు ఖరారు చేసింది. ఇందులో అభ్యర్థులంతా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. తెలంగాణలో 32 స్థానాల్లో పోటీచేస్తామని తాజాగా ప్రకటించిన జనసేన పార్టీ.. పాత కరీంనగర్ జిల్లాలో నాలుగు స్థానాలపై కన్నేసింది. రామగుండం, హుస్నాబాద్, జగిత్యాల, మంథని స్థానాల నుంచి తమ అభ్యర్థులు బరిలోకి దిగుతారని ప్రకటించడం గమనార్హం.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్కిట్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని పెద్దాపూర్ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కిట్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో స్వీప్–2023 జిల్లాస్థాయిలో ఇటీవల స్కిట్ పద్యపాట పోటీలు నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన 22 మంది పాల్గొని ఓటర్లను చైతన్యపరిచే నాటికను ప్రదర్శించారు. ప్రణీత్, అరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయి స్కిట్ పోటీలకు ఎంపికైనట్లు డీఆర్‌డీవో పీడీ లక్ష్మీనారాయణ మంగళవారం ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపల్ విద్యాసాగర్ తెలిపారు.

రచయిత గజానన్ కన్నుమూత

మంథని: తెలుగు, సంస్కృత, మరాఠీతోపాటు ఆంగ్లభాషల్లో నిష్ణాతులు, ఆచార్యులు, పండితులు, కవి, రచయిత పట్టణానికి చెందిన గజానన్ థామన్(87) మంగళవారం కన్నుమూశారు. మానస సరోవరం, సాకేత రామాయణం ద్వారా తెలుగుసాహితీ ప్రపంచంలో ఆయన బహు ప్రశంసలందుకున్నాయి. మహారాష్ట్ర నాందేడ్‌లో కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత నుంచి ఇక్కడే నివాసముంటున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు.. థామన్ భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

గజానన్ మృతి తీరని లోటు

కోల్‌సిటీ: ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ ప్రొఫెసర్ గజానన్ తామన్ మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు అని గోదావరిఖనికి చెందిన స్నేహసాహితీ గ్రంథాలయ నిర్వాహకుడు, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు ఏలేశ్వరం వెంకటేశ్, వేల్పుల నారాయణ, తాళ్లపెల్లి శంకర్, మేజిక్ రాజా, మందల రవీందర్‌రెడ్డి, లెనిన్, రాకుమార ఆవేదన వ్యక్తం చేశారు. గజానన్ మృతికి సంతాపం తెలిపారు. మహారాష్ట్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గజానన్.. పదవీ విరమణ తర్వాత మంథనిలో నివాసం ఉంటూ, మానస సరోవరం లాంటి మంచి కవితా సంపుటాలు వెలువరించారని కొనియాడారు.

రైలుకిందపడి వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: స్థానిక శాంతినగర్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పేర్కొన్నారు. ఒంటిపై తెలుపు టీషర్ట్, ముదురు బూడిద రంగు లోయర్ ప్యాంటు ఉన్నాయని వివరించారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.





రజకులకు మంచి రోజులు

- పురపాలికల్లో ఆధునిక దోబీఘాట్లు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ధర్మపురి మినహా 13 పురపాలికల్లో టెండర్లు పూర్తి
- ఒక్కో దోబీఘాట్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు





రాజన్న సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ఆధునిక దోబీఘాట్

ధర్మపురి: రజకులు తమ కుల వృత్తుల ద్వారా ఆదాయం పెంపొందించుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఉచిత కరెంటుతో పాటు ఇస్త్రీ పెట్టెలు అందజేసింది. అంతే కాకుండా రజక వృత్తిలో వచ్చిన ఆధునిక సాంకేతికను వారు అందిపుచ్చుకునేందుకు ఆధునిక దోబీఘాట్ల నిర్మాణాలు చేపట్టనుంది. ముందుగా స్మార్ట్ నగరాల్లో ఏర్పాటు చేసిన ఆధునిక దోబీఘాట్లు సత్ఫలితాలివ్వడంతో తెలంగాణలోని అన్ని పట్టణాలు, నగరాలు, పురపాలికల్లో నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్లలో 14 పురపాలికల్లో ఏర్పాటు చేయనుంది. రాజన్న సిరిసిల్ల పురపాలికలో ఇప్పటికే దోబీఘాట్ నిర్మించగా మిగిలిన 13 పురపాలికలకు నిధులు మంజూరయ్యాయి.

ఒక్కో దోబీఘాటుకు రూ.2 కోట్లు..

ఉమ్మడి జిల్లాల వారీగా ఆధునిక దోబీఘాట్లు..

జిల్లా	దోబీఘాట్లు		మంజూరైన నిధులు రూ.కోట్లలో..)
కరీంనగర్	4	4	8
జగిత్యాల	5	5	10
రాజన్నసిరిసిల్ల	2	2	4
పెద్దపల్లి	2	2	4

ఉమ్మడి కరీంనగర్‌లోని 14 పురపాలికలకు తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన (టీయూఎఫ్‌ఐడీసీ) పథకం కింద రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వాటిలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇదివరకే దోబీఘాట్ నిర్మించగా, వేములవాడ, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి, పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్, మంథని, పెద్దపల్లి మున్సిపాలిటీల్లో స్థలాలను ఎంపిక చేసి జూలై, ఆగస్టు నెలల్లో టెండర్లు పూర్తి చేశారు. ధర్మపురిలో స్థలం కేటాయించాల్సి ఉంది. కాగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇటీవల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ఆధునిక దోబీఘాట్ పనులకు శంకుస్థాపన చేశారు.

ధర్మపురిలో స్థల పరిశీలన

ధర్మపురి పురపాలికలోని 8వ వార్డు నర్సయ్యపల్లె రూట్‌లో ఇటీవల తహసీల్దార్ కృష్ణ చైతన్య, కమిషనర్ రమేశ్ స్థలాన్ని ఎంపిక చేసి కలెక్టర్ ఆమోదం కోసం పంపించారు. కాగా ఆధునిక దోబీఘాట్లతో రజకులకు మంచి ఆదాయం సమకూరనుంది. 120 కిలోల సామర్థ్యమున్న దోబీఘాట్‌లో ఒక రోజులో సుమారు 8 గంటల పాటు ప్లాంట్ నిర్వహిస్తే వెయ్యి జతల దుస్తులు ఉతికి ఆరబెట్టవచ్చు. పట్టణాలు, నగరాల్లో ఆస్పత్రులు, వసతి గృహాలు అధికంగా ఉన్నందున ఆదాయం పెంచుకోవచ్చు.

టెండర్లు పూర్తి..



ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ధర్మపురి మినహా మిగతా చోట్ల దోబీఘాట్ల నిర్మాణాలకు ఇటీవల టెండర్లు పూర్తి అయినవి. ఈ ఏడాది చివరి వరకు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– సంపత్‌రావు, ప్రజారోగ్య ఈఈ

రజకుల సంక్షేమం కోసం..



రజకుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత కరెంటుతో ఇస్త్రీ పెట్టెలను అందించింది. కొత్తగా ఆధునిక దోబీఘాట్లను ఏర్పాటు చేయనుంది.

– కొప్పుల ఈశ్వర్, సంక్షేమశాఖ మంత్రి

గోడు వినరు.. పరిష్కరించరు



ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- 23వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె
- అధికారులకు సవాల్‌గా పౌష్టికాహారం పంపిణీ

గొల్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగిన విషయం విదితమే. వారి సమ్మె మంగళవారం నాటికి 23వరోజుకు చేరింది. టీచర్లు, ఆయాలు సమ్మెలోకి వెళ్లడంతో అంగన్‌వాడీల నుంచి సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. సమానపనికి సమాన వేతనం, టీచర్లకు రూ.26వేలు ఇస్తూనే.. ఉద్యోగ విరమణ బెనిఫిట్‌ను రూ.10లక్షలకు పెంచాలని, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రోజుకోరకంగా వినూత్న రీతిలో ఆందోళనకు దిగుతున్నారు.

వారానికి సరిపడా..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉండడంతో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు ఆయా సెంటర్లకు వెళ్లి వారానికి సరిపడా సరుకులను ఒకేసారి అందిస్తున్నామని చెబుతున్నారు. అయితే చాలాచోట్ల అధికారులను అంగన్‌వాడీలు అడ్డుకుంటున్నారు. కొన్నిచోట్ల అధికారులు తాళాలు పగులగొట్టి సరుకులు అందజేస్తున్నారు.

సమ్మె విరమించం



సమాన పనికి సమాన వేతనం అందించాలి. మా సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదు. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపులేకుండా పోయింది. చర్చలు జరిపి మా సమస్యలు పరిష్కరించాలి. ఎంతగా పనిచేసినా మాకు గుర్తింపు దక్కడం లేదు.

– రజిత, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం జిల్లా అధ్యక్షురాలు

న్యాయం చేయాలి



ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తూ పనిచేస్తున్నప్పటికీ మా సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటివరకు అధిక పనిభారం మోపినా చేశాం. సమాన పనికి సమానవేతనం ఇవ్వాల్సిందే. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. అప్పటివరకు సమ్మెలోనే ఉంటాం.

– తాండ్ర రమాదేవి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మండల అధ్యక్షురాలు

న్యాయం జరిగే దాకా పోరాటం



మేం పడుతున్న కష్టానికి తగిన ఫలితం కావాలంటున్నాం. వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మె చేస్తున్నాం. ప్రభుత్వం చెప్పిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేస్తున్నాం. అలాంటి మాపై సర్కారు ఎందుకో వివక్ష చూపుతోంది. మాకు న్యాయం చేయకుంటే సమ్మె కొనసాగిస్తాం.

– చెన్నాడి హరిప్రియ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మండల ప్రధాన కార్యదర్శి

మంత్రి కేటీఆర్ పర్యటన ప్రశాంతం



డీపీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు



ఆకట్టుకున్న ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శనలు

- భారీగా పోలీసుల మోహరింపు
- వాహనాల దారి మళ్లింపు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం, వ్యవసాయ సమీకృత మార్కెట్, నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్, హోంమంత్రి మహమూద్‌అలీ, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రావడంతో జిల్లా కేంద్రంలో ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే వాహనాలను పాతబస్టాండ్‌లో కార్యకర్తలను దింపి మిషన్‌కాంపౌండ్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వైపు పార్కింగ్ చేయించారు. కేటీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కలెక్టర్ కార్యాలయం వద్ద దిగారు. అక్కడి నుంచి మినీబస్సులో వెళ్లి ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి నూకపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. అక్కడి నుంచి బీట్‌బజార్‌లోని సమీకృత వ్యవసాయ మార్కెట్‌ను ప్రారంభించి మినీబస్‌లో కొత్త బస్టాండ్, తహసీల్ చౌరస్తా, పాతబస్టాండ్ మీదుగా మినీస్టేడియంకు చేరుకున్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్ సంతృప్తి

ధర్మపురి: కేటీఆర్ బహిరంగ సభతో ధర్మపురి గులాబీమయమైంది. నియోజకవర్గం వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ప్రైవేట్ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై సుమారు 10వేలకు పైగా హాజరయ్యారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల కిక్కిరిసి పోయింది. మంత్రి కేటీఆర్ ముందుగా మాతాశిశు ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరించారు.

అభివృద్ధి తప్ప వేరేధ్యాస లేని కొప్పుల

వెల్గటూర్: నియోజకవర్గ అభివృద్ధి తప్ప మరో ధ్యాస లేని నాయకుడు కొప్పుల ఈశ్వర్ అని మంత్రి కేటీఆర్ కొనియాడారు. మండలంలోని స్తంభంపల్లి వద్ద ఇథనాల్ పరిశ్రమ స్థానంలో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు ధర్మపురిలో జరిగిన సభలో శంకుస్థాపన చేశారు. వెల్గటూర్ వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం కొప్పుల ఈశ్వర్ తాపత్రయపడి ఇథనాల్ పరిశ్రమ తీసుకొస్తే కాంగ్రెస్ నాయకులు చుట్టు పక్కల గ్రామాల రైతులను రెచ్చగొట్టి అడ్డంకులు సృష్టించారని తెలిపారు. ఆ పరిశ్రమ స్థానంలో వ్యవసాయ కళాశాల నిర్మించాలని సీఎం కేసీఆర్‌ను కొప్పుల అడగగానే అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రమోషన్లు లేని బదిలీలు వద్దు

- తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య

జగిత్యాలటౌన్: ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీ చేయడం సరికాదని తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నార ని, పదోన్నతి షెడ్యూల్ ప్రకటించి తీరా ఇప్పుడు ఎస్జీటీల బదిలీ మాత్రమే చేయాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5శాతం మధ్యంతర భృతి ఆమోదయోగ్యం కాదని, 20శాతం వెంటనే ప్రకటించాలని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఐఆర్ ప్రకటించడం శోచనీయమని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఓ విద్యార్థికి గాయాలు..?
- ప్రిన్సిపాల్‌కు తల్లిదండ్రుల ఫిర్యాదు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో థర్డ్ ఇయర్, ఫోర్త్‌ఇయర్ విద్యార్థుల మధ్య గొడవ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం క్యాంటీన్ వద్ద చోటుచేసుకున్న గొడవ కాస్తా గదుల్లోకి వెళ్లి కొట్టుకునే వరకూ చేరినట్లు తెలుస్తోంది. థర్డ్ ఇయర్ విద్యార్థులను ఫైనలియర్ విద్యార్థులు కొట్టగా ఓ విద్యార్థి ముక్కు పగిలినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ వద్దకు చేరి మాట్లాడారు. విద్యార్థులు ఘర్షణ పడిన విషయంపై కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ వారికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ర్యాగింగ్, స్నేహపూరితంగా మెలిగే తీరుపై విద్యార్థుల్లో అటు కళాశాల యాజమాన్యంగానీ.. ఇటు పోలీసులుగానీ.. అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు.

ఓపెన్ స్కూల్ గడువు పొడిగింపు

జగిత్యాల: తెలంగాణ ఓపెన్‌స్కూల్ 2023–24 సంవత్సరానికి సంబంధించి ప దో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఈ నెల 13 వరకు గడువు పొడగించినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 98492 66786నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన శ్రీనివాస్

ధర్మపురి: కేటీఆర్ సభకు వచ్చి న ఓ ప్రైవేట్ బస్సు ఓ యు వకుడినిఢీ కొంది. ఈ సంఘటనలో అతడికి కాలు నుజ్జునుజ్జయ్యింది. ధర్మపురికి చెందిన మాదాసు శ్రీనివాస్ కొంత కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతుంటాడు. కేటీఆర్ సభకు జనాన్ని తీసుకొచ్చిన ఓ ప్రైవేట్ బస్సు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శ్రీనివాస్‌ను ఢీకొంది. బస్సు కాలుకు తగలడంతో తీవ్ర గాయమైంది. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగాధర్



ద్యావనపెల్లి గంగాధర్

కోరుట్ల రూరల్: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ద్యావనపల్లి గంగాధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ వీరమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కార్యవర్గాన్ని బలోపేతం చేసేందుకు గంగాధర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల సురేష్ పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన వారికి గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత శిక్షణ

జగిత్యాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నాబార్డ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమానికి మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ సహాయ సంచాలకులు గోలి రమేశ్ తెలిపారు. నిరుద్యోగులకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, వైరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు, భోజన వసతి ఉంటుందని, ఆసక్తి గలవారు 99633 53830 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నెరవేరనున్న మూడు గ్రామాల కల

- సంగెం–కోరుట్ల, సంగెం–యెఖీన్‌పూర్ బ్రిడ్జిలకు అదనపు నిధులు
- రెండు వంతెనలకు రూ.4.3 కోట్లు మంజూరు
- తొందరలోనే పనులు ప్రారంభం




సంగెం–యెఖీన్‌పూర్ పెద్ద వాగు బ్రిడ్జి

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం–యెఖీన్‌పూర్, కోరుట్ల–సంగెం గ్రామాల మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న వంతెనల పనులు నిధుల లేమితో నిలిచిపోగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చొరవతో రెండు వంతెనల పూర్తికి మరో రూ.4.3 కోట్లు మంజూరయ్యాయి. దీంతో సంగెం, యెఖీన్‌పూర్, నాగులపేట గ్రామాల ప్రజల చిరకాల కల నెరవేరనుంది.

ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభం..

సంగెం–యెఖీన్‌పూర్ పెద్దవాగుపై వంతెన, చెక్‌డ్యామ్‌కు రూ.4.10 కోట్లు, సంగెం–కోరుట్ల పెద్దవాగుపై చెక్‌డ్యామ్, వంతెనకు రూ.3.5 కోట్లు మంజూరుకాగా.. 2017లో పనులు ప్రారంభించారు. రెండుచోట్ల చెక్‌డ్యాం పనులు పూర్తికాగా, వంతెన పనులు నిలిచిపోయాయి. అంచనా వ్యయం పెరగటంతో కాంట్రాక్టర్లు సంగెం–యెఖీన్‌పూర్ వంతెన పనులు స్లాబులు వేసి వదిలేశారు. మిగతా రేలింగ్, బ్యాక్‌ఫిల్లింగ్ పనులు చేపట్టలేదు. సంగెం–కోరుట్ల వంతెన పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. దీంతో ఇంజినీరింగ్ అధికారులు పెరిగిన అంచనా వ్యయానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక కృషితో సంగెం–యెఖీన్‌పూర్ వంతెనకు రూ.1.5 కోట్లు, సంగెం–కోరుట్ల వంతెన పనులకు రూ.3.8 కోట్లు అదనంగా మంజూరయ్యాయి. దీంతో టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభం కానున్నాయి. వంతెన పనులు పూర్తయి రెండు వంతెనలూ వినియోగంలోకివస్తే సంగెం, నాగులపేట, యెఖీన్‌పూర్ గ్రామాలప్రజలు, కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి, బొమ్మెన ప్రజలకు కోరుట్ల పట్టణానికి రావటానికి దూర భారం తగ్గనుంది.


8 కిలోమీటర్లు తగ్గుతుంది



సంగెం–కోరుట్ల వంతెన పనులు పూర్తయితే నాగులపేట నుంచి కోరుట్ల వెళ్లేందుకు సుమారు 8 కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. సంగెం–యెఖీన్‌పూర్ వంతెన పూర్తయితే యెఖీన్‌పూర్– నాగులపేట మధ్య రవాణా భారం తగ్గుతుంది.

– లవంగ సాగర్, నాగులపేట


టెండర్ కాగానే పనులు



ఈ వంతెనల పనులకు అదనపు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభం అవుతాయి. మరో నెల రోజుల్లో వాగులో నీళ్లు కూడా తగ్గుతాయి. పనులు ప్రారంభానికి అడ్డంకులు ఉండవు.

– గోపాల్ డీఈ, పంచాయతీరాజ్

ఎమ్మెల్యే కృషితోనే..



అదనపు నిధుల కోసం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఎంతో కృషి చేశారు. అంచనా వ్యయం పెరగటంతో పనుల్లో జాప్యం జరిగింది. నిధులు మంజూరు కావటం చాలా సంతోషం. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– చీటి వెంకట్రావు, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు